క్లుప్తంగా

నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య



మాట్లాడుతున్న కిష్టయ్య

కేశంపేట: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు విడతల్లో బిల్లులను చెల్లిస్తోందన్నారు. లబ్ధిదారుల అకౌంట్‌కు నేరుగా డబ్బులు చెల్లిస్తారని స్పష్టం చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా బిల్లుల చెల్లింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గూడ వీరేశ్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, హైతాబాద్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొన్న వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాన్‌ందార్ఖాన్‌పేట్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో వారు పాల్గొని బొడ్రాయికి పూజలు చేశారు. కార్యక్రమంలో లింగారెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బొడ్రాయి ఉత్సవాలు అని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, జయరాంరెడ్డి, లక్ష్మణ్ నాయక్, వీరేశంగుప్తా, చందునాయక్, అశోక్ రెడ్డి, శివరాజ్‌గౌడ్, జంగయ్య, సంతోష్‌నాయక్, లక్ష్మయ్య, విష్ణుగౌడ్, రవి, రఘుగౌడ్, యాదయ్య, సురేశ్, మహేశ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



సురేశ్‌గుప్తాకు సన్మానిస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: జిల్లాలో నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గందె సురేశ్‌గుప్తాను చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లాలోని అన్ని మండలాల పర్యటనలో భాగంగా మంగళవారం చేవెళ్లకు వచ్చిన ఆయనకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనను కలిసి వారిలో చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశంగుప్తా, కోశాధికారి రమేశ్, జిల్లా సభ్యులు శ్రీరామ్, సత్యం, భద్రసేన, మండల సభ్యులు రఘు, శ్రీనివాస్, వీరేందర్, నాగరాజు, రఘు, ప్రశాంత్, వీరేశం, నవీన్, విజయ్, రమేశ్, రవికిరణ్, తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

కొందుర్గు: బీసీలు ఐకమత్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చని జాతీయ బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రకారం బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని సూచించారు.

చౌదరిగూడ గ్రామ కమిటీ ఏర్పాటు

అధ్యక్షురాలుగా సుంకరి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వసంత, కార్యదర్శిగా నాగమణి, కోశాధికారిగా సాజిద ఎన్నికయ్యారు.



సోలీపూర్ శివారులో జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు నిర్మించకపోవడంతో పెరిగిన చెట్లు



చటాన్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీసు రోడ్డు

సర్వీసు రోడ్డు లేక అవస్థలు!

- జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- సర్వీస్ రోడ్డు నిర్మిస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో మేలు
- పట్టించుకోని హైవే అథారిటీ అధికారులు

షాద్‌నగర్: ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బైపాస్ జాతీయ రహదారికి సమాంతరంగా ఉన్న సర్వీస్ రోడ్డు సరిగా లేదు. ఫలితంగా వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సర్వీసు దారిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు

2009లో నిర్మాణం

కొత్తూరు నుంచి షాద్‌నగర్ పట్టణ శివారు మీదుగా 2009లో బైపాస్ జాతీయ రహదారిని నిర్మించారు. అయితే జాతీయ రహదారి పక్కనే సమాంతరంగా సర్వీసు రోడ్డు నిర్మిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. కానీ నేటికీ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారినపడి మృత్యువాతపడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి

కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సర్వీసు రోడ్డు నిర్మించాలని ఇప్పటికీ పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సర్వీసు రోడ్డు నిర్మిస్తే జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో సులభంగా ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

సర్వీసు రోడ్లు సరిగా లేక ఇబ్బందులు

షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి చౌరస్తా నుంచి కొత్తపేట రోడ్డు అండర్‌పాస్ వరకు సర్వీసు రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా షాద్‌నగర్ పట్టణ శివారులోని కేశంపేట బైపాస్ నుంచి సోలీపూర్ గ్రామానికి వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సోలీపూర్ గ్రామానికి వెళ్లాలంటే జాతీయ రహదారి పక్కన ఉన్న మట్టిరోడ్డు గుండా బ్రిడ్జి కింది నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా చటాన్‌పల్లి నుంచి నందిగామ వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన లింగారెడ్డిగూడ గ్రామ శివారులో సర్వీసు రోడ్డులో చెరువు నీరు నిలిచింది. దీంతో ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

సర్వీసు రోడ్డు నిర్మించాలి



జాతీయ రహదారి పక్క నుంచి సోలీపూర్ గ్రామానికి మట్టిరోడ్డు గుండా వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే బ్రిడ్జి వద్ద నీరు నిలుస్తోంది. అధికారులు స్పందించి బీటీరోడ్డుగా నిర్మించాలి.

– జంగయ్య, సోలీపూర్, షాద్‌నగర్

చర్యలు చేపట్టాలి



జాతీయ రహదారి పక్కన ఉన్న మట్టి రోడ్డును అధికారులు అభివృద్ధి చేయాలి. బీటీరోడ్డుగా నిర్మిస్తే వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రోడ్డు పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లేందుకు సులభతరం అవుతుంది.

– శ్రీను నాయక్, షాద్‌నగర్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

షాద్‌నగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. మహిళలు కేవలం వంటింటికి మాత్రమే పరిమితం కాకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని సూచించారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కావాల్సిన ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కుట్టులో శిక్షణ పొందిన మహిళలు మరిన్ని మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు ఆలియా సుల్తానా, నాయకులు ఇబ్రహీం, రఘునాయక్, అమ్రిన్, మానస, అరుణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని నిరసన



చేవెళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ మున్సిపాలిటీలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రామస్వామి, కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు ఇలా కార్మికులకు అన్యాయం చేస్తూ ఉంటూ చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

మండల విద్యాధికారి చంద్రశేఖర్

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), ఏఐపై శిక్షణను అందిస్తున్నారన్నారు. గతంలో జిల్లాస్థాయిలో కొంతమంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించామని వారే మండలంలోని ఉపాధ్యాయులకు ఈ నెల 24వరకు తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు సంబంధించిన ప్రతి విషయాన్ని వివరిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు మల్లేశ్, రామకృష్ణ, మల్లయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఏలియన్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. వారందరూ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. చిన్ననాటి స్నేహితులతో ఆటాపాటలతో ఎంతో ఉత్సాహంగా అలరించారు. కార్యక్రమంలో పలబట్ల ఆనంద్, ముబారక్, కూచూరి ప్రవీణ్, మన్నె నారాయణయాదవ్, నక్కల వెంకటేశ్‌గౌడ్, మంగులాల్‌నాయక్, నందకిషోర్, గార్లపాటి శ్రీనివాస్, రాజు, చిన్న, ఖాజా పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

విద్యానైపుణ్యాల పెంపునకు కృషి

శిక్షణ ఇన్‌చార్జి అధికారి మల్లయ్య



మాట్లాడుతున్న ఇన్‌చార్జి అధికారి మల్లయ్య

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మొయినాబాద్, గండిపేట మండలాల ఉపాధ్యాయుల శిక్షణ ఇన్‌చార్జి అధికారి మల్లయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల పల్లవి పాఠశాలలో మొయినాబాద్, గండిపేట మండలాల ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణకు 202 మంది ఉపాధ్యాయులకుగాను 188 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఐదురోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణకు గైర్హాజరైతే పైఅధికారులకు నివేదిస్తామన్నారు. ఉపాధ్యాయులు సక్రమంగా శిక్షణకు హాజరై విద్యా నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. 25 వరకు శిక్షణ కొనసాగుతుందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. సకాలంలో ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్‌తో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాస్ పేరుతో స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల అజీజ్‌నగర్ రహదారిలో డాక్టర్ అశ్విజ హరిబాబు ప్రైవేట్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నూతన టెక్నాలజీ పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువత స్వయం ఉపాధి పొందేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో మంది యువత దరఖాస్తులు చేసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, చేవెళ్ల యూత్ బ్లాక్ మాజీ అధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, అజీజ్‌నగర్ మాజీ సర్పంచ్ బండ్లగూడ సంధ్యాశ్రీశైలం, మత్స్యకారుల రాష్ట్ర నాయకుడు వడ్డె సత్తయ్య, అశోక్‌యాదవ్, రామకృష్ణగౌడ్, పట్నం రాంరెడ్డి, మిట్టు, షాబాద్ టిల్లు, యాదగిరిచారి పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక లాభాలు

వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త అలీబాబా



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త అలీబాబా

మొయినాబాద్: రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి అధిక లాభాలు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని సీజన్‌లలో ఒకే రకమైన పంటను వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ విధానాలను పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త చిరంజీవి, పీహెచ్‌డీ విద్యార్థులు సమీరా, స్నిగ్ధ, మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓ సునీల్‌కుమార్, మాజీ ఎంపీటీసీ అర్జున్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాల వినియోగంపై శిక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజయ్య

చేవెళ్ల: వ్యవసాయ యంత్రాలను వినియోగించే పద్ధతులను తెలుసుకోవటం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ యంత్రాల పరిరక్షణ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.రాజయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండలంలోని కుమ్మెర గ్రామంలో మంగళవారం దక్షిణ ప్రాంత వ్యవసాయ యంత్ర శిక్షణ, పరిరక్షణ సంస్థ అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ వారి సహకారంతో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్ర పరికరాల నైపుణ్యాలపై మహిళా రైతులకు మూడురోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో శ్రమను తగ్గించటం, ఉత్పాదకతను, సామర్థ్యాన్ని పెంచడటంలో యంత్ర పరికరాలు సహాయపడుతాయన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన మహిళలకు చిన్నపాటి ఈ పరికరాలు పరిచయం చేయటం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. మహిళా రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ టెక్నీషియన్ భాస్కర్, భాస్కర్‌రావు, మండలంలోని మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ రోడ్డు తొలగింపు!

- గతంలోనే ఠాణాకు రెండు వైపులా దారులు
- అప్పుడు ఎందుకు రోడ్డు వేశారు.. ఇప్పుడెందుకు తొలగిస్తున్నారు?
- అయోమయంలో మండల ప్రజలు

నందిగామ: నందిగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి మారింది. ఆ స్టేషన్‌కు రెండు రోడ్లు ఉండగా.. ప్రస్తుతం ఒక రోడ్డును ఓ వ్యక్తి పూర్తిగా తొలగించి ఫ్రీ కాస్ట్‌తో ప్రహరీని సైతం నిర్మించాడు. దీంతో స్థానిక ప్రజలు అప్పట్లో రోడ్డు ఎందుకు వేశారు.. ఇప్పుడు ఎందుకు రోడ్డును తొలగిస్తున్నారో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు.

గతంలోనే రెండు రోడ్లు..

గతంలో కొత్తూరు మండలంలో ఒక గ్రామ పంచాయతీగా ఉన్న నందిగామను మండలముగా ఏర్పాటు చేశారు. అప్పట్లో 10 గ్రామ పంచాయతీలతో కూడిన నందిగామను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పడిన మండలంలో పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే గ్రౌండ్ ఫ్లోర్‌లో పోలీస్ స్టేషన్, మొదటి అంతస్తులో జీపీ కార్యాలయం కొనసాగింది. ఈ నేపథ్యంలో నూతనంగా పోలీస్ స్టేషన్‌కు భవనాన్ని నిర్మించేందుకు సర్వే నం.1414లో కొంత స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. దీంతో నాట్కో పరిశ్రమ యాజమాన్యం తమ ట్రస్టు ద్వారా నూతనంగా భవనాన్ని నిర్మించింది. అప్పట్లో ఈ పోలీస్ స్టేషన్‌కు తూర్పు వైపునకు ఒక రోడ్డు, ఉత్తరం వైపునకు మరొక రోడ్డును వేశారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత అప్పటి హోంశాఖ మంత్రి మహ్మద్ అలీ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు.



నందిగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో తవ్వకాలు

ప్రస్తుతం ఇలా..

పోలీస్ స్టేషన్‌కు గతంలోనే ఉత్తరం వైపునకు లేఅవుట్ రోడ్డు ఉంది. తూర్పు వైపునకు రోడ్డు లేకపోవడంతో వేస్తే పాత జాతీయ రహదారికి వెళ్లేందుకు దగ్గరగా ఉంటుందనే ఆలోచనతో అటువైపు సైతం భవనాన్ని నిర్మించే సమయంలో రోడ్డు వేశారు. ప్రస్తుతం తూర్పు వైపుగా ఉన్న రోడ్డును గత రెండు మూడురోజులుగా తొలగిస్తూ ఫ్రీ కాస్ట్ వేస్తున్నారు. గత కొంతకాలంగా ఉన్న రోడ్డును ఉన్నట్టుండి ఇప్పుడెందుకు తొలగిస్తున్నారో అనే విషయమై రోడ్డున వెళ్లే ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు. కాగా పోలీస్ స్టేషన్‌కు పడమర, దక్షిణం వైపులు మినహా ఇస్తే సుమారు 20 ఏళ్ల క్రితమే కొంత మంది గ్రామ పంచాయతీ లేఅవుట్ వేశారు. దీంతో తూర్పు వైపునకు, ఉత్తరం వైపునకు ప్లాట్లు ఉన్నాయి. ఆ ప్లాట్లు ఇప్పటికే ఎంతో మంది చేతులు సైతం మారాయి. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌కు తూర్పు వైపునకు పాత జాతీయ రహదారికి ఆనుకొని ఓ వ్యక్తి ప్లాట్ ఉండగా, ఆ ప్లాట్‌లో నుంచే పోలీస్ స్టేషన్‌కు అప్పట్లో రోడ్డు వేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ ప్లాట్ యజమానే రోడ్డును తొలగించి తమ ప్లాట్‌కు ఫ్రీకాస్ట్ వేస్తున్నాడా.. లేక మరేదైనా కారణం ఉందా అనే అయోమయంలో మండల ప్రజలు ఉన్నారు. ఈ విషయమై నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. అప్పట్లో ఓ ప్లాట్‌లో నుంచి పోలీస్ స్టేషన్‌కు రోడ్డు వేశారని, ప్రస్తుతం ఆ యజమాని స్థలాన్ని తీసుకుంటున్నారన్నారు. ఈ విషయం ఉన్నతాధిరుల దృష్టిలో సైతం ఉందని వెల్లడించారు.